# స్వార్థం

– మల్లాది వెంకట కృష్ణమూర్తి

ఇండియాలో కొత్తగా వస్తున్న ఓ బ్యాంక్ ముందు ఆగిందో జీప్. అందులోంచి ఒకతను దిగాడు. అతని వెనుక ముగ్గురు తుపాకులు ధరించినవారు దిగారు. ఒకడు ఎ.టి.యం. పక్కనే వున్న ఆ బ్యాంక్ గార్డు దగ్గరకి పరిగెత్తుకెళ్లి అతని ఛాతీకి తుపాకి బేరల్‌ని ఆనించి చెప్పాడు.

"కదిలితే ఛస్తావ్!"

ముందు దిగిన అతను మిగిలిన ముగ్గురు గన్‌మన్‌లతో అద్దాల తలుపు తెరుచుకుని, కార్పెట్ పరచి, అందం కోసం తాజా పూలతో అలంకరించిన ఫ్లవర్‌వాజ్‌లున్న ఆ ఎయిర్ కండిషన్డ్ బ్యాంక్‌లోకి వెళ్లాడు.

ఇద్దరు బయట స్టాఫ్‌ని కవర్ చేస్తుంటే, అతను మిగిలిన గన్‌మన్‌తో బ్యాంక్ మేనేజర్ గదిలోకి కోపంగా వెళ్లాడు. గన్‌మన్ చేతిలోని తుపాకిని చూసి మేనేజర్ కంగారు పడ్డాడు.

"ప్రభుత్వాధికారుల్లో ఐఏఎస్ నుంచి అటెండెంట్ వరకు లంచం తీసుకోకుండా పనిచేసేవారు ఈ రోజుల్లో అరుదు. అలా సంపాదించింది వాళ్లు మీ బ్యాంక్‌లో దాచుకుంటున్నారని నాకు రూఢిగా తెలిసింది. నాకు వాళ్ల పేరు, చిరునామాలు కావాలి" చెప్పాడతను.

అప్పటికే బ్యాంక్ మేనేజర్ మొహం నిండా చిరుచెమట పట్టింది.

"సారీ! మా ఖాతాదారుల వివరాలు మేం బయటి వాళ్లకు ఇవ్వకూడదన్న రూల్ వుంది" చెప్పాడు మేనేజర్.

"అది నాకు తెలుసు. నీ ప్రాణాలు పోకుండా వుండాలంటే నే చెప్పింది నువ్వు చేసి తీరాలి" ఉగ్రంగా అరిచాడతను.

"వెరీ సారీ సర్. నేను మీకు సమాచారం ఇవ్వను" చెప్పాడు బ్యాంక్ మేనేజర్.

అతను కోపంగా జేబులోంచి రివాల్వర్ తీసి బ్యాంక్ మేనేజర్ తలకి ఆనించి చెప్పాడు–

"నీ ప్రాణాలు కాపాడుకుంటావో, లేక చస్తావో నీ ఇష్టం"

బ్యాంక్ మేనేజర్ కాళ్లు చేతులు భయంతో వణుకుతున్నాయి.

"ఐయాం సారీ సర్. మేం మా ఖాతాదారుల వివరాలు చాలా రహస్యంగా ఉంచుతాం"

"సరే! నాకు టైం లేదు. నేను అయిదు లెక్కపెట్టేలోగా ఏం చేస్తావో నీ ఇష్టం. ఫైవ్..."

"నన్ను క్షమించండి. నాకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు" టై కట్టుకుని వున్న ఆ యాభై ఏళ్ల మేనేజర్ బ్రతిమాలుతున్నట్లుగా చెప్పాడు.

"ఫోర్..."

"నా మీద దయ చూపించండి"

"త్రీ..."

"అది మా బ్యాంక్ పాలసీకి విరుద్ధమైన పని. బ్యాంక్ ఉప్పు తింటున్న నేను బ్యాంక్‌కి నష్టం వచ్చే పని చేయలేను"

"టూ..."

తన ప్యాంట్‌లో మూత్రం పోసుకున్న సంగతే మేనేజర్ గుర్తించలేదు.

"వన్..."

బ్యాంక్ మేనేజర్ కళ్లు మూసుకుని ముందు రివాల్వర్ పేలిన శబ్దం వినపడుతుందా, లేక గుండు దిగిన నొప్పి తెలుస్తుందా అని ఆలోచిస్తున్నాడు.

కానీ వాటిలో ఏవీ జరగకపోవడంతో కళ్లు తెరచి చూస్తే, ఆనందంగా నవ్వుతూ తన రివాల్వర్‌ని జేబులో ఉంచుకుంటున్న అతను కనిపించాడు.

"కృష్ణా జిల్లా అడిషనల్ ఎస్పీ చెప్పింది నిజమే. మీ బ్యాంక్‌ని రహస్యం విషయంలో నమ్మొచ్చు. అరేయ్! జీప్‌లోని డబ్బున్న బ్యాగ్‌లని తీసుకురండిరా" అని నవ్వుతూ చెప్పాడు మేనేజర్‌తో.

"నేను కూడా ఓ ఐ.పి.ఎస్. ఆఫీసర్‌ని. ఆరు కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడానికి అప్లికేషన్ ఫారం ఇవ్వండి."

# కొల్లేటి ఖేదం

ఒక అసంబద్ధ
అధివాస్తవిక పద్యపాదంలా కొల్లేరు

చీకటి తెరచాపల్ని
బతుకు పడవలకి ముడివేసుకుంటుంటే
బోన్‌సాయి బురద తరుముకొస్తుంది

నీళ్లమీద ఊళ్లు జలయాత్ర మొదలవ్వగానే
అలసిన అలల చూపుల మధ్య
ఏ సుజల దృశ్యమూ నిలదొక్కుకోదు

కాలుష్యం భళ్లున పగిలి
కొల్లేరు ముఖం మీద పడిందేమో
వొళ్లంతా నల్లనల్లని మచ్చలు

మూగస్పర్శతో మూలిగే కొల్లేరు–
తడి పొడి జ్ఞాపకమౌతుంటే
ఒక బీభత్సం... ఒక భయోత్పాతం
నా గొంతులోంచి రాలే
నిర్లిప్త స్వర తుంపర్లలో నానీ నానీ ముద్దౌతాయి

నేనిప్పుడు ముక్కలౌతున్న
జల చిత్రాల పునస్సమ్మేళన–
సౌందర్య రూపాన్ని స్వప్నిస్తున్నాను

కొల్లేటి స్పర్శలో
గుబాళించిన మానవీయ లాలిత్యాన్ని
నిలువెల్లా కప్పుకుంటాను

పగిలిన పాలగుండెను
నీళ్ల వేళ్లతో నిమురుతూ
కొల్లేరు
ఒక నిర్నిద్ర నిశ్శబ్ద వలయంలా
నా చుట్టూ అల్లుకుంటుంది
కత్తిరి పిట్ట నోట చిక్కిన చేపలా

కొల్లేరు కోసం–
జ్వలించడం నేరమైతే...
ఆ నేరం నాదే... ఆ ఖేదం నాదే..!!
(అముద్రిత "కొల్లేరు" దీర్ఘకవితా కావ్యం నుంచి...)

– ఎస్. ఆర్. భల్లం.